సాక్షి
సూర్యాపేట
గురువారం । 4 । జనవరి । 2024



జీవితాన్ని నిలబెట్టిన 'జీవన్‌దాన్'
కోదాడ పట్టణానికి చెందిన ఓ యువకుడికి జీవన్‌దాన్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా కిడ్నీ మార్పిడి చేశారు. - 10లో



శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం
మట్టపల్లి ఆలయంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. - 10లో



క్రీడల గొప్పతనం తెలుసుకోవాలి
విద్యార్థులు క్రీడల గొప్పతనం తెలుసుకోవాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

సదరం క్యాంపులకు స్లాట్ బుక్ చేసుకోవాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సదరం క్యాంపులకు హాజరయ్యే అర్హులందరూ ఈనెల 4, 24 తేదీల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకున్న వారందరూ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి ఈనెల 11, 18, 31 తేదీల్లో రావాలని కోరారు. జనవరి నెలలో 345 స్లాట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

లింగగిరి ఉపాధ్యాయురాలికి సావిత్రీబాయి అవార్డు



జాజుల శ్రీనివాస్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయురాలు జ్యోతి

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలం లింగగిరి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు ఇందిరాల జ్యోతికి రాష్ట్ర స్థాయిలో సావిత్రీబాయి పూలే అవార్డు వరించింది. బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి దాసరి సీతక్క, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ చేతులు మీదుగా ఈ అవార్డును ఆమె అందుకున్నారు. జ్యోతికి అవార్డు రావడం పట్ల జెడ్పీహెచ్‌ఎస్ కాంప్లెక్స్ చైర్మన్ పెండ్యం శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, ధనలక్ష్మి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

వాసవీ క్లబ్ జోనల్ చైర్మన్‌గా ఇమ్మడి సతీష్



కోదాడఅర్బన్ : వాసవీ క్లబ్ జోనల్ చైర్మన్‌గా కోదాడకు చెందిన ఎస్ఆర్ఐ ఇమ్మడి సతీష్‌బాబు నియమితులయ్యారు. బుధవారం కోదాడలో నిర్వహించిన కార్యక్రమంలో సతీష్‌కు క్లబ్ ఉమ్మడి జిల్లా గవర్నర్ రాచర్ల కమలాకర్ నియామకపత్రం అందజేశారు. కాగా, వాసవీ క్లబ్ కోదాడ అధ్యక్షుడిగా 2023 సంవత్సరంలో సతీష్ చేసిన విశేష కృషికి, కోదాడ క్లబ్‌ను అంతర్జాతీయ పటంలో నిలిపేవిధంగా చేసిన సేవలకు ఈ పదవి లభించింది. సతీష్‌ను వాసవీ క్లబ్ నాయకులు చల్లా విజయశేఖర్, గరిణె శ్రీనివాసరావు, తదితరులు అభినందించారు.

సృజనాత్మకతకు సైన్స్ సంబరాలు దోహదం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ అశోక్

సూర్యాపేటటౌన్ : విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించడానికి చెకుముకి సైన్స్ సంబరాలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 19న పాఠశాల స్థాయి పరీక్షను, 27న మండల స్థాయిలో, ఫిబ్రవరి 3న జిల్లా స్థాయిలో నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిభావంతులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు కె.శ్రవణ్‌కుమార్, ఎర్రంశెట్టి రాంబాబు, ప్రతాప్, జేవీవీ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు, దయానంద్ పాల్గొన్నారు.

యాదాద్రిలో నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నిత్యపూజలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు స్వయంభూ, ప్రతిష్టా అలంకార మూర్తులకు సుప్రభాతం, అర్చన, అభిషేకం చేపట్టారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు గావించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు గావించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

విజృంభిస్తున్న వ్యాధులు



వీరు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఓపీ విభాగం వద్ద క్యూలో నిల్చున్న రోగులు. ఈ ఆస్పత్రిలో ఓపీ విభాగానికి రోగుల తాకిడిపెరిగింది. రోజూ 600 నుంచి 800 మందికి పైగా రోగులు రావడంతో ఆస్పత్రిలోని ఓపీ టోకెన్లు ఇచ్చే హాల్ నుంచి బయటి వరకు ఇలా బారులుదీరుతున్నారు. పేరు నమోదుకు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇటీవల వాతావరణంలో మార్పులు చేసుకోవడంతో పాటు చలి తీవ్రత పెరగడంతో ప్రజలు జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి బారినపడుతున్నారు. దీంతో రోగులతో ఆస్పత్రి కిటకిటలాడుతోంది.

- జలుబు, దగ్గు, జ్వరం, గొంతు నొప్పితో బాధపడుతున్న జనం
- వాతావరణ మార్పులతోనే ఈ పరిస్థితి
- కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు

సూర్యాపేట: జిల్లాలో వ్యాధులు విజృంభిస్తున్నాయి. చలి తీవ్రత కారణంగా ఒక్కసారిగా ప్రజలు జలుబు, దగ్గు, గొంతునొప్పి, జ్వరం బారిన పడుతున్నారు. దీంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు ప్రాథమిక, అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రైవేట్ ఆస్పత్రులు కిక్కిరిసిపోతున్నాయి. చాలామంది ఆస్పత్రులకు వెళ్లలేక మంచానపడుతున్నారు. ముఖ్యంగా గొంతునొప్పి ఎక్కువ మందిలో కనిపిస్తుండడంతో కరోనా అనే భయంతో ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు.

పెరిగిన చలి కారణంగా..

వాతావరణ మార్పులతో జిల్లాలో ఒక్కసారిగా విష జ్వరాలు ప్రబలుతున్నాయి. రాత్రింబవళ్లు తేడా లేకుండా ఈదురు గాలులు వీస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పూర్తిగా పడిపోవడంతో వృద్ధులు, చిన్నారుల్లో శ్వాస సంబంధ వ్యాధులు ప్రబలుతున్నాయి. చలి తీవ్రత వల్ల జలుబు, దగ్గు, జ్వరం, గొంతునొప్పితో బాధపడుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో వారం రోజుల్లో టైఫాయిడ్ 217, దగ్గు 821, జలుబు 3,265, సాధారణ జ్వరం సంబంధిత కేసులు 1,625 నమోదయ్యాయి.

జనరల్ ఆస్పత్రి	01
ఏరియా ఆస్పత్రి	01
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	23
కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు	03

జిల్లాలో 20 రోజుల్లో ..

కరోనా పరీక్షలు చేయించుకున్నవారు	రిజల్ట్
4,237 మంది	నెగెటివ్

వ్యాధులు	బాధితుల సంఖ్య
దగ్గు	6,214
టైఫాయిడ్	985
సాధారణ జ్వరం	13,269

కరోనా భయం

జిల్లాలో జ్వరాలు ప్రజలను వణికిస్తుంటే మరోవైపు కరోనా కలకలం రేపుతోంది. వారం రోజులుగా రాష్ట్రంలో అక్కడక్కడా కరోనా కేసులు నమోదవుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కరోనా ఒమిక్రాన్ వేరియంట్‌కు చెందిన జేఎన్-1 సబ్ వేరియంట్ రూపంలో భయపెడుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు ఎలాంటి కేసులు నమోదు కానప్పటికీ హైదరాబాద్‌లో కేసులు నమోదవుతుండడంతో వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. దగ్గు, జ్వరం, జలుబు, గొంతు నొప్పి వంటి లక్షణాలు ఉండడంతో పాటు వారానికి పైగా తగ్గకుండా ఉన్నవారికి కరోనా అనుమానం ఉంటే వెంటనే ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు అన్ని పీహెచ్‌సీల్లో అనుమానితులకు కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో వారం రోజుల్లో 1532 మందికి పరీక్షలు నిర్వహించారు.

అందుబాటులో వైద్యులు, మందులు

వ్యాధులు ప్రబలుతుండడంతో జిల్లా ఆస్పత్రిలో మందులు, వైద్యులను ఎల్లవేళలా అందుబాటులో ఉంచుతున్నాం. పేషెంట్లు ఏ సమయంలో వచ్చినా చికిత్స అందించేలా అన్ని ఏర్పాట్లు చేశాం. ఎక్కువగా దగ్గు, జలుబు, జ్వరం, గొంతునొప్పి వంటి జబ్బుల బారిన పడుతున్నారు. చాలామంది ఓపీ చూపించుకుని మందులు తీసుకొని వెళ్తున్నారు.
– డాక్టర్ మురళీధర్‌రెడ్డి, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

● సావిత్రీబాయికి నివాళి



తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి జయంతి సందర్భంగా బుధవారం సూర్యాపేటలో ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

బోగస్ కూలీల నమోదుకు చెక్

- ఉపాధి హామీ కూలీలకు ఫేస్ రికగ్నిషన్ హాజరు
- నూతన విధానానికి కేంద్రం శ్రీకారం
- పైలెట్ ప్రాజెక్టుగా కొన్ని మండలాల్లో కొనసాగుతున్న ప్రక్రియ



యాప్‌లో ఫేస్ రికగ్నిషన్ హాజరు నమోదు చేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది (ఫైల్)

హుజూర్‌నగర్ : ఉపాధి హామీలో బోగస్ కూలీల నమోదును అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఇప్పటికే జాబ్‌కార్డుకు ఆధార్‌కార్డు అనుసంధానం చేయిస్తోంది. అంతే కాకుండా ప్రస్తుతం కూలీలకు ఆధార్ ఆధారిత ఫేస్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) హాజరు తీసుకోవాలని నిర్ణయించింది. ప్రయోగాత్మకంగా కొన్ని మండలాల్లో ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. అది విజయవంతమైతే జిల్లావ్యాప్తంగా అమలు చేయనున్నారు.

మొత్తం 5.73 లక్షల మంది కూలీలు

జిల్లాలో మొత్తం ఉపాధిహామీ జాబ్ కార్డులు 2.61 లక్షలు ఉన్నాయి. వాటిలో నమోదైన కూలీలు 5.73 లక్షల మంది ఉన్నారు. కూలీల జాబ్ కార్డులు 1.42 లక్షలు ఉన్నాయి. పని చేసిన కూలీలు 2.52 లక్షలు మంది ఉన్నారు. వారిలో దివ్యాంగులు 4,157 మంది ఉన్నారు. 100 రోజుల పని పూర్తి చేసుకున్న కుటుంబాలు 403 ఉన్నాయి.

ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా..

ఉపాధి కూలీల హాజరుకు ఎన్ఎంఎంఎస్ యాప్ ప్రవేశపెట్టారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ముందుగా పనులు చేసేవారి వివరాలు సేకరిస్తారు. వారికి ఎక్కడ, ఎన్ని రోజులు పని కేటాయించారనే వివరాలు యాప్‌లో నమోదు చేస్తారు. అందులో పేర్లున్న వారు పనికి వచ్చారో లేదో పని ప్రదేశంలోనే చూస్తారు. పని పూర్తికాగానే కూలీల ముఖాన్ని ఫొటో తీస్తారు. వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. దీంతో ఆధార్ అనుసంధానం చేసిన వారికి మాత్రమే హాజరు పడుతుంది. కొన్ని మండలాల్లో ప్రయోగాత్మకంగా ఈ ప్రక్రియ అమలు చేస్తున్నారు. అక్కడ విజయవంతమైతే అంతటా ఫేస్‌రికగ్నిషన్ హాజరు ప్రక్రియను అమలు చేయనున్నారు.

నిజమైన కూలీలకు చెల్లించడానికి..



ఉపాధిహామీలో పని చేయకున్నా చేసినట్లు బిల్లులు కాజేసిన ఘటనలు వెలుగు చూశాయి. ఒకరికి బదులు మరొకరు పనిచేసి డబ్బులు తీసుకున్న ఘటనలు లేకపోలేదు. ప్రస్తుత అమలు చేయబోయే ఫేస్ రికగ్నిషన్ హాజరు విధానం వల్ల పనిచేసిన నిజమైన కూలీలకు చెల్లింపులు జరుగుతాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా త్వరలో అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.
– ఎస్. కిరణ్ కుమార్, డీఆర్‌డీఓ

తుది దశకు ఆధార్ అనుసంధానం

బోగస్ కూలీలను ఏరివేతకు జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేస్తున్నారు. ఈ ప్రక్రియ గతనెల నుంచి కొనసాగుతోంది. ప్రస్తుతం తుది దశకు చేరింది. జాబ్‌కార్డులో ఆధార్‌లో పేరు సరిగా లేని కారణంగా కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. జాబ్‌కార్డు పొందే సమయంలో ఏదో ఒక పేరు నమోదు చేశారు. ఆధార్‌లో అసలు పేరు చేర్చారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 5,906 మంది కూలీలు ఉన్నారు. వీరివి అనుసంధానం కాకుంటే పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కమిషనర్‌కు నివేదించి వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

దురాజ్ పల్లి (సూర్యాపేట) : వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల శాసనమండలి స్థానానికి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జిల్లాలో అర్హులైన పట్టభద్రులు ఫామ్ 18ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఎ. వెంకట్‌రెడ్డి సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్ లో జిల్లాలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులు నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఓటరు నమోదుకు వచ్చే నెల 6వతేదీ చివరి గడువు అని పేర్కొన్నారు. వచ్చే నెల 24 ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తారని, ఇదే రోజు నుంచి మార్చి 14వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారని వివరించారు. మార్చి 29న అభ్యంతరాలను పరిష్కరిస్తారన్నారు. ఏప్రిల్ 4న తుదిజాబితా విడుదల చేస్తారని చెప్పారు. ఆన్‌లైన్‌లో కూడా ఓటరు నమోదుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. జిల్లాలో 2023 నవంబర్ 1 నాటికి డిగ్రీ పూర్తయి మూడేళ్లు నిండిన వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చని, ఏదైనా యూనివర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నుంచి చకిలం రాజేశ్వర రావు, బీఆర్ఎస్ నుంచి సవరాల సత్యనారాయణ, బీజేపీ నుంచి ఆబిద్, సీపీఎం నుంచి కోటా గోపి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

భూ ఆక్రమణలను వెలికి తీయాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని కుడకుడ శివారు సర్వేనంబర్లు 126, 110 ,160 లలో గల ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైందని, ఈభూమిని వెలికి తీసి పేదలకు పంచాలని సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా సూర్యాపేట జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివ కుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, పేర్ల నాగయ్య, రాంజీ, సయ్యద్ హుస్సేన్, కరుణాకర్ పాల్గొన్నారు.

ఇప్పటి వరకు 1.72లక్షల దరఖాస్తులు



నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 11వ వార్డులో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు



బస్సులో ప్రయాణికులతో మాట్లాడుతున్న కలెక్టర్

- ప్రజాపాలనకు అనూహ్య స్పందన
- కలెక్టర్ వెంకట్రావు

నేరేడుచర్ల : ప్రజా పాలన కార్యక్రమానికి అనుహ్య స్పందన వస్తోందని, జిల్లాలో ఇప్పటి వరకు 1.72లక్షల అభయహస్తం దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ ఎస్. వెంకట్రావు చెప్పారు. బుధవారం నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో అభయ హస్తం దరఖాస్తులు, రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. నమోదు చేసుకున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామ సభ జరిగే ప్రాంతాల్లో దరఖాస్తులు అందజేయలేని వారు మరుసటి రోజు ఇవ్వొచ్చని, రేషన్ కార్డులు లేని వారు కూడా దరఖాస్తు చేయవచ్చన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ శంకరయ్య, కమిషనర్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు బచ్చలకూరి వెంకటేశ్వర్లు, కోణతం చిన వెంకట్‌రెడ్డి, రణపంగ నాగయ్య పాల్గొన్నారు.

మహిళలకు వరం.. మహాలక్ష్మి పథకం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : మహిళకు మహాలక్ష్మి పథకం ఒక వరమని కలెక్టర్ ఎస్. వెంకట్రావు అన్నారు. బుధవారం నేరుడుచర్లకు వెళ్తూ మార్గ మధ్యలో సూర్యాపేట నుంచి మిర్యాలగూడ వెళ్తున్న ఆర్టీసీ బస్సులో కలెక్టర్ ప్రయాణం చేశారు. మహిళలను పలకరించి ప్రభుత్వ పథకాలు వివరించారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో మహాలక్ష్మి పథకానికి ముందు ఆర్టీసీ బస్సుల్లో రోజుకూ 51,500 మంది ప్రయాణిస్తే అందులో 40శాతం మంది మహిళలు ఉండేవారని, పథకం ప్రారంభించిన తర్వాత ఇప్పుడు మొత్తం 75,500 మంది ప్రయాణిస్తుండగా వీరిలో 60శాతం మంది మహిళలు ఉన్నారని వివరించారు.

నర్సరీలో మొక్కల పెంపకం సరిగా లేదు

పెన్‌పహాడ్: నర్సరీల్లో మొక్కల పెంపకం సరిగా లేదని కలెక్టర్ వెంకట్రావు అసహనం వ్యక్తం చేశారు. బుధవారం పెన్‌పహాడ్ మండలం మాచారంలోని నర్సరీని తనిఖీ చేశారు. నర్సరీలో మొక్కల పెంపకం సరిగా లేదని బ్యాగుల్లో వేసిన విత్తనాలు సరిగా మొలకెత్తలేదని, పర్యవేక్షణ సరిగా లేదన్నారు. గుల్మోహర్, గానుగ, మారేడు మొక్కలను కలెక్టర్ పరిశీలించారు. ఇంత మంది ఉండి కూడా మొక్కలు సరిగా లేకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్ సువర్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతి, ఏకస్వామి ఉన్నారు.

వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు



తిరుమలగిరిలో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

తిరుమలగిరి(తుంగతుర్తి): రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కాకముందే బీఆర్ఎస్ నాయకులు అవాకులు, చెవాకులు పేలుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు వంద రోజుల్లో కచ్చితంగా అమలవుతాయని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంకేపల్లి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం తిరుమలగిరిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు పాలు చేసిందని విమర్శించారు. పదేళ్లలో సుమారు రూ.7లక్షల కోట్ల అప్పులు చేసిందని ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిపై, ఎమ్మెల్యే సామేల్‌పై మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడని నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. తిరుమలగిరి మండలంలో దళిత బంధులో జరిగిన అవినీతి అక్రమాలపై జ్యుడీషియల్ ఎంక్వైరీ చేయిస్తామని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మూల రవీందరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పేరాల వీరేష్, సంకెపల్లి కొండల్ రెడ్డి, జుమ్మీలాల్, శాతవాహనరావు, కందుకూరి అంబేద్కర్, ఎండీ కలీమ్, బత్తుల శ్రీను, రాజీరెడ్డి, లక్ష్మయ్య, యాదగిరి, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్‌కు రసాయనాలు కరువు

- నాలుగైదు ఏళ్లుగా విడుదల కాని నిధులు
- ఈ ఏడాది కూడా అదే పరిస్థితి
- పాత వాటితోనే పరీక్షలకు..
- ప్రాక్టికల్స్‌కు హాజరుకానున్న 9,500 మంది విద్యార్థులు



సూర్యాపేటటౌన్ : జిల్లాలో ఇంటర్ విద్యార్థులకు ప్రయోగాలు చేసేందుకు రసాయనాలు, పరికరాలు కరువయ్యాయి. చాలా కళాశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటర్మీడియట్‌లో ప్రయోగ పరీక్షలు ప్రధాన భూమిక పోషిస్తాయి. వంతశాతం మార్కులు సాధించేందుకు ఇవి దోహదపడతాయి. అంతటి ప్రాధాన్యమున్న ప్రయోగ పరీక్షలపై నిర్లక్ష్యం చూపుతుండటంతో ప్రభుత్వ కళాశాలల్లోని విద్యార్థులు నష్టపోవాల్సి వస్తుంది. పాఠాలను ప్రయోగపూర్వకంగా వివరిస్తే పూర్తి స్థాయిలో అవగాహన కలుగుతుంది. జిల్లాలో చాలా కళాశాలల్లోని ప్రయోగశాలల్లో పరికరాలు, రసాయనాలు లేవు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరగనున్నాయి. ప్రయోగాలకు అవసరమయ్యే రసాయనాలు, సామగ్రి కళాశాలలకు సరఫరా కాలేదు. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు ప్రయోగాలు చేయడానికి ఏటా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నిధులు రాకపోవడంతో..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ప్రయోగ పరీక్షలకు ఉపయోగపడే రసాయనాలు, పరికరాలకు సంబంధించిన నిధులు నాలుగైదు ఏళ్లుగా ప్రభుత్వం విడుదల చేయడం లేదు. దీంతో ఉన్న వాటితోనే సర్దుకోవాల్సి వస్తోంది. అరకొర ఉండే రసాయనాలతో ప్రయోగాలు చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు ప్రాక్టికల్స్ సమయంలో ఉపయోగపడే బ్యూరెట్, పిప్పెట్, క్లోనికల్ గ్లాసు తదితర పరికరాలు కొన్ని కళాశాలల్లో చాలా తక్కువగా ఉన్నాయి. అలాగే రసాయనాల్లో తాజాగా ఉండాల్సిన హైడ్రోక్లోరిక్ ఆమ్లం, సల్ఫ్యూరిక్ ఆమ్లం, నత్రికామ్లం అందుబాటు లేవు. పాతవి కావడంతో ఆమ్లాలలోని గాఢత తగ్గిపోయి నిర్దిష్టంగారావడం లేదు. జీవశాస్త్రానికి సంబంధించి క్రొమటోగ్రఫీలో ఎసిటోన్, ఇథైల్ ఆల్కహాల్, ఫినాప్తలీన్ ముఖ్యమైనవి. భౌతిక, రసాయనశాస్త్రంలోనూ వీటి అవసరం ఉంటుంది. ఈ ఆమ్లాల సీసాల బిరడాలను ఒక సారి తీసేస్తే మరోసారి ప్రయోగానికి పనికిరావు. ఇవన్నీ ఆవిరయ్యే గుణాలు కలిగి ఉంటాయి. ఏళ్ల తరబడి రసాయనాలు అందకపోతే విద్యార్థులు ప్రయోగాలు ఎలా చేస్తారని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

పాత వాటితోనే ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తాం

ప్రయోగశాలల్లో రసాయనాల కోసం గతంలో నాలుగైదు ఏళ్ల క్రితం నిధులు వచ్చేవి. ప్రస్తుతం ఎలాంటి నిధులు రాలేదు. చాలా కళాశాలల్లో రసాయనాలు, పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం పాత వాటితోనే ప్రయోగ ప్రరీక్షలు నిర్వహిస్తాం.
– జానపాటి కృష్ణయ్య, డీఐఈఓ

ఫిబ్రవరి 1 నుంచి ప్రాక్టికల్స్

జిల్లాలో ప్రయోగ పరీక్షలను ఫిబ్రవరి 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందుకు 44 సెంటర్లను ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం ఏడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కేజీబీవీలు ఐదు, మోడల్ స్కూల్స్ 9, సోషల్ వెల్ఫేర్ కళాశాలలు 8, ట్రైబల్ వెల్ఫేర్‌లు మూడు, బీసీ గురుకులాలు 8, మైనార్టీ కళాశాలలు నాలుగు, రెసిడెన్షియల్ కళాశాల ఒకటి ఉంది. వీటిలో ద్వితీయ సంవత్సరం 9,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా ప్రాక్టికల్స్‌కు హాజరుకానున్నారు. అయితే కొన్ని కళాశాలల్లోని ప్రయోగశాలల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్టు పలు ఆరోపణలు ఉన్నాయి. గతంలో సైతం అరకొర నిధులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ప్రతి కళాశాలకు రూ. 25వేల వరకు నిధులు ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ అరకొర నిధులు కూడా రాక విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


మందుల శంకర్

చండూరు(గట్టుప్పల్): గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన మందుల శంకర్ మంగళవారం భార్యతో గొడవపడి ఇంట్లోనే తన సెల్ ఫోన్‌ను వదిలేసి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో శంకర్ భార్య ఉషారాణి బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చండూరు ఎస్‌ఐ సురేష్‌కుమార్ తెలిపారు. శంకర్ ఆచూకీ తెలిసిన వారు 8712670182 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ సూచించారు.

వృద్ధురాలు దారుణ హత్య

- కొట్టి చంపిన గుర్తుతెలియని వ్యక్తులు
- ఇంట్లో ఒంటరిగానే ఉంటున్న మృతురాలు


మంచంపై విగతజీవిగా పడి ఉన్న లీలమ్మ

నేరేడుచర్ల: గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో వృద్ధురాలు దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్నె గ్రామ పంచాయతీ పరిధిలోని తెలగరామయ్యగూడెంలో బుధవారం జరిగింది. నేరేడుచర్ల ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం .. తెలగరామయ్యగూడేనికి చెందిన సోమ లీలమ్మ(80) భర్త చనిపోవడంతో ఆమె ఇంట్లో ఒంటరిగానే ఉంటోంది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. రోజుమాదిరిగానే మంగళవారం రాత్రి కూడా లీలమ్మ ఇంట్లో ఒంటరిగానే నిద్రించింది. అయితే బుధవారం ఉదయం లీలమ్మ ఎంతకీ బయటకు రాకపోవడంతో ఇరుగుపొరుగు వారు ఇంట్లోకి వెళ్లి చూడగా మంచంపై ఆమె విగతజీవిగా కనిపించింది. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. లీలమ్మ మొహంపై గాయాలు, రక్తపు మరకలు ఉండడంతో గుర్తుతెలియని వ్యక్తులు ఆమెను పదునైన ఆయుధంతో కొట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. మృతురాలి కుమారుడు సోమగాని సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం

- లోకోపైలెట్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

నల్లగొండ క్రైం: మద్యం మత్తులో ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేయగా.. లోకోపైలెట్ అప్రమత్తతో అతడు ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన బుధవారం నల్లగొండ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని ఓ చికెన్ సెంటర్‌లో పనిచేసే రాజు మద్యం మత్తులో బుధవారం నల్లగొండ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడు. అదే సమయంలో గుంటూరు నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న రైలు ట్రెన్ నల్లగొండ రైల్వే స్టేషన్‌లో ఆగిన తర్వాత నెమ్మదిగా ముందుకు కదిలింది. రైలులోని లోకోపైలెట్‌కు పట్టాలపై పడుకున్న రాజు కనిపించడంతో కిందికి దిగి అతడిని దూరంగా తీసుకెళ్లాడు. ఆ తర్వాత రైలును ముందుకు కదిలిస్తుండగా.. రాజు మళ్లీ వచ్చి పట్టాలపై పడుకున్నాడు. ఇలా 3 సార్లు చేయడంతో సమీపంలోని వారు వచ్చి రాజును దూరంగా తీసుకెళ్లారు. కాగా కుటుంబ తగాదాలతో మద్యం మత్తులో రాజు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించినట్లు అక్కడికి వచ్చిన వారు చర్చించుకోవడం గమనార్హం.

వాసాలమర్రి గోస!


ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వకపోవడంతో గుడిసె వేసుకుని జీవనం సాగిస్తున్న దృశ్యం


కూలడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లు

ప్రశ్నార్థకంగా గ్రామ పునర్నిర్మాణం

- మూడేళ్ల క్రితం దత్తత తీసుకున్న కేసీఆర్
- సర్వేలు, ప్రతిపాదనలతోనే సరి
- ప్రభుత్వం మారడంతో అభివృద్ధిపై నీలినీడలు
- ఆందోళనలో గ్రామస్తులు
- నూతన ప్రభుత్వం పట్టించుకోవాలని వేడుకోలు

సాక్షి యాదాద్రి : మాజీ సీఎం కేసీఆర్ దత్తత గ్రామం వాసాలమర్రి అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారింది. బంగారు వాసాలమర్రిగా మారుస్తానన్న కేసీఆర్ వాగ్దానం కార్యరూపం దాల్చలేదు. మూడేళ్లుగా సర్వేల మీద సర్వేలు, ప్రతిపాదనలతో హైక్ క్రియేట్ చేసినా ఏదీ జరగలేదు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళనలో గ్రామస్తులు ఉన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తమ గ్రామాన్ని దత్తత తీసుకోవాలని కోరుతున్నారు.

2020 నవంబర్‌లో దత్తత

ఆలేరు నియోజకవర్గం తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రిని అప్పటి సీఎం కేసీఆర్ 2020 నవంబర్1వ తేదీన దత్తత తీసుకున్నారు. రూ.150 కోట్లకు పైగా ప్రభుత్వ నిధులతో గ్రామాన్ని బంగారు వాసాలమర్రిగా మారుస్తానని గ్రామ సభలో ప్రకటించారు. కలెక్టర్ అధ్యక్షతన గ్రామ అభివృద్ధి కమిటీని నియమించారు. ఏడాదిలోగా అభివృద్ధి చేసి చూపిస్తానని ప్రకటించారు. అయితే దత్తత తీసుకున్న 10 నెలల దాకా వాసాలమర్రి వైపు కన్నెత్తి చూడలేదు. ఆ తర్వాత గ్రామాన్ని నూతన లేఅవుట్ ప్రకారం అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పాత ఇళ్లు కూలిచి కొత్తవి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాటు యువతకు స్థానికంగా ఉపాధి కల్పిస్తామని, ప్రతి ఇంటికి పాడి గేదె, అవసరమైన వారికి ట్రాక్టర్లు అందజేస్తామని, అందుకోసం జాబితాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు రూ.150 కోట్లతో ఒకసారి, రూ.165 కోట్లతో మరోసారి డీపీఆర్ రూపొందించి సీఎం పేషీకి పంపించారు. అయితే ఈ క్రమంలోనే ప్రభుత్వం పంపించిన ఆర్కిటెక్ట్‌లు ప్లాన్ రూపొందించి మార్కింగ్ చేశారు. తదనంతరం గ్రామంలో సొంతంగా నూతన ఇళ్ల నిర్మాణానికి గ్రామ పంచాయతీ అనుమతులు నిలిపివేసింది.

రూ.58.57 కోట్లు కేటాయింపు

గ్రామ అభివృద్ధికోసం గత ఏడాది ఏప్రిల్ 18న జారీ చేసిన 159 జీఓ ప్రకారం రూ. 58.57 కోట్లు కేటాయించారు. ఒక్కో ఇల్లు రూ.5 లక్షల వ్యయంతో 481 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం కోసం రూ.24.24 కోట్లు మంజూరు అయ్యాయి. గ్రామ పంచాయతీ భవనం కోసం రూ.20 లక్షలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల భవన నిర్మాణానికి రూ.3.23 కోట్లు, రూ.75 లక్షలతో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు, రూ.25 లక్షలతో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మించాలని నిర్ణయించారు. రోడ్లు, పార్కులు, ఫంక్షన్ హాల్ సహా మౌలిక వసతుల కోసం రూ.30.14 కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటించారు.

కలెక్టర్ బదిలీతో నిలిచిన పనులు

వాసాలమర్రిని కేసీఆర్ దత్తత తీసుకొని 2023 నవంబర్ 1 నాటికి మూడేళ్లు పూర్తి అయినా పనుల్లో పెద్దగా కదలిక రాలేదు. అప్పటి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి గత సెప్టెంబర్‌లో లేఅవుట్ ప్రకారం ఇళ్ల పునర్నిర్మాణం కోసం టెండర్లు పిలుస్తామని ప్రకటిచారు. కానీ ఈలోపు ఆయన బదిలీ కావడంతో టెండర్లు పిలువలేదు. ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. టెండర్లు వేసిన తర్వాత ఉన్న ఇళ్లను కూలగొట్టుకుంటే తమవి చెట్టు కింద బతుకుల అయ్యేవని గ్రామస్తులు సాక్షితో చెప్పారు. నూతన ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కింద రూ.5 లక్షలు మంజూరు చేస్తే తమ స్వంత స్థలంలో ఇళ్లు నిర్మించుకుంటామని గ్రామస్తులు కోరుతున్నారు.

నిధులు పోకుండా చూడాలి



కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు వాసాల మర్రి అభివృద్ధికి కొన్ని నిధులు కేటాయించారు. అవి పక్కకు పోకుండా చూడాలి. 200 గజాల స్థలం ఇస్తామని చెప్పడంతో చాలా మంది ఇళ్లు నిర్మించుకోలేదు. గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ,, పాఠశాల తప్ప ఎటువంటి అభివృద్ధి జరగలేదు. డ్రెయినేజీలు, సీసీ రోడ్లు లేవు. సమస్యలతో సతమతమవుతున్నాం. –మధు, వాసాలమర్రి

కొత్త సీఎం పట్టించుకోవాలి



ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోవడంతో గ్రామస్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. గతంలో ఉన్న సీఎం కేవలం యాదగిరిగుట్ట నుంచి ఆయన ఫాం హౌజ్ వరకు మాత్రమే రోడ్డు వేశారు. మిగతా పనులన్ని అలాగే వదిలిపెట్టారు. గతంలో రోడ్డు వేసేటప్పుడు రెండు ఇళ్లు తొలగించి పరిహారం కూడా ఇవ్వలేదు. కొత్త సీఎం పట్టించుకోవాలి. –లింగయ్య, వాసాలమర్రి

గ్రామం పూర్తిగా నష్టపోయింది



అప్పటి సీఎం కేసీఆర్ మా గ్రామాన్ని దత్తత తీసుకొని బంగారువాసాలమర్రిగా మారుస్తానంటే సంతోషపడ్డాం. అప్పుడు విడుదల చేసిన రూ.55 కోట్లతో చేపట్టిన పనులు జరుగుతున్నాయి.రూ.45 కోట్ల మేర పనులకు బడ్జెట్ రావాల్సి ఉంది. గ్రామంలో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు నిలిచిపోయాయి. సీడీఎఫ్ నిధులు కూడా వాడుకోలేకపోయాం. ప్రభుత్వం మారడంతో పునరాలోచనలో పడ్డాం.100 కుటుంబాలకు పైగా తమ ఇళ్లపై కవర్లు కప్పుకొని జీవనం సాగిస్తున్నాయి. ఎమ్మెల్యే, మంత్రి, సీఎం గ్రామంలో పర్యటించి ప్రజల పరిస్థితిని చూడాలి. అభివృద్ధి పనులు పూర్తి చేయాలి. అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యటనలు, సభలు, సమావేశాల కోసం నేను వ్యక్తిగతం రూ.25లక్షలు ఖర్చు చేశాను. అయినా ప్రయోజనం లేకుండాపోయింది. –పోగుల అంజనేయులు, సర్పంచ్, వాసాలమర్రి,

ఉమ్మడి జిల్లాకు ఎనిమిది నర్సింగ్ కళాశాలలు

- 100 పడకల ఆస్పత్రులకు అనుబంధంగా ఏర్పాటు
- ప్రభుత్వం నుంచి త్వరలో ఉత్తర్వులు
- మెరుగుపడనున్న వైద్యసేవలు

చౌటుప్పల్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో నర్సుల కొరతకు త్వరలోనే తీరనుంది. 100 పడకల ఆస్పత్రులకు అనుబంధంగా నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఎనిమిది కళాశాలలు రానున్నాయి. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నాయి.

ఈ ప్రాంతాల్లో ఏర్పాటు

ఉమ్మడి జిల్లాలో ఎనిమిది ప్రాంతాల్లో నర్సింగ్ కళాశాలలు అందుబాటులోకి రానున్నాయి. నల్లగొండ జిల్లాలో దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, నకిరేకల్, సూర్యాపేట జిల్లాలో హుజూర్‌నగర్, కోదాడ, తుంగతుర్తి, యాదాద్రి భువనగిరిలో చౌటుప్పల్‌లో ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో కాలేజీలో 50 సీట్లు రానున్నాయి. నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన నిర్ణయాన్ని వెల్లడించిన నేపథ్యంలో ఇప్పటికే నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే కళాశాలలను 100 పకడల ఆస్పత్రులకు అనుబంధంగా ఏర్పాటు చేస్తారా, ప్రత్యేకంగా నూతన భవనాలు నిర్మిస్తారా అన్నది స్పష్టత రావల్సి ఉంది.

ఆస్పత్రుల్లో నర్సుల కొరత

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నర్సుల కొరత తీవ్రంగా ఉంది. రోజువారీగా వచ్చే రోగుల సంఖ్యకు అనుగుణంగా నర్సులు లేకపోవడంతో వైద్యసేవలు సరిగా అందడం లేదు. రాష్ట్రంలో ఏటా వేల మంది విద్యార్థులు బయటకు వస్తున్నా స్థానికంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో ఇతర ప్రాంతాలు, విదేశాలకు వెళ్తున్నారు. ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్–2012 ప్రకారంగా ప్రతి 100 పడకలకు 45 మంది నర్సులు ఉండాల్సి. కానీ,అందులో సగం కూడా లేరు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు నూతన నర్సింగ్ కళాశాలలు అందుబాటులోకి వస్తే నర్సుల కొరత తీరనుంది. క్షేత్ర స్థాయిలో పర్యటించి పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లలో రోగులకు వైద్యసేవలు అందించనున్నారు.

జాతీయ స్థాయిలోనూ రాణించాలి


గణేశ్‌ను అభినందిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి

మిర్యాలగూడ అర్బన్: క్రీడాకారులు జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధించాలని మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి అన్నారు. మిర్యాలగూడ మండలంలోని రాంనగర్‌కు చెందిన ఐతరాజు గణేష్ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే (అండర్–19, 70కేజీల విభాగం) పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. బుధవారం డీఎస్పీ వెంకటగిరి తన కార్యాలయంలో గణేశ్ అభినందించి మాట్లాడారు. యువకులు చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా క్రీడలపై దృష్టిసారించాలని సూచించారు. అనంతరం కోచ్ శ్రీధర్‌ను కూడా అభినందించారు.

నల్లగొండ కలెక్టర్‌గా హరిచందన

- 20 రోజుల క్రితం హెల్త్ డైరెక్టర్‌గా బదిలీ అయిన ఆర్‌వి.కర్ణన్
- ఇప్పటి వరకు ఇన్‌చార్జి కలెక్టర్‌గా వ్యవహరించిన హేమంత్ కేశవ్ పాటిల్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లా కలెక్టర్‌గా హరిచందన దాసరి నియమితులయ్యారు. ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసిన ఆర్‌వి.కర్ణన్‌ను 20 రోజుల క్రితం ప్రభుత్వం రాష్ట్ర హెల్త్ డైరెక్టర్‌గా బదిలీ చేసింది. అప్పటి నుంచి పూర్తి అదనపు బాధ్యతలను అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు అప్పగించింది. ప్రస్తుతం నల్లగొండ జిల్లాకు కలెక్టర్‌గా 2010 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి హరిచందనను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇన్‌చార్జి బాధ్యతల నుంచి హేమంత్ కేశవ్ పాటిల్‌ను రిలీవ్ చేసింది. ఇప్పటివరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌గా, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా ఉన్న హరిచందన గురువారం లేదా శుక్రవారం నల్లగొండ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.



తండ్రి బాటలో సివిల్స్ వైపు..

హరిచందన తండ్రి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి హైదరాబాద్‌కు చెందిన దాసరి శ్రీనివాసులు. ఆమె విద్యాభ్యాసం ఉమ్మడి రాష్ట్రంలోని హైదరాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, పాడేరు, కాకినాడలో సాగింది. పదో తరగతి ప్రకాశం జిల్లాలో చదివారు. ఇంటర్ హైదరాబాద్ సెయింట్ ఆన్స్ కాలేజీలో చదవిన ఆమె.. డిగ్రీ (బీఏ ఎకనామిక్స్) హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పూర్తి చేసి గోల్డ్ మెడల్ సాధించారు. ఆ తరువాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పర్యావరణ అర్థశాస్త్రంలో మాస్టర్స్ పూర్తి చేశాక కార్బన్ క్రెడిట్స్‌పైన పరిశోధన చేశారు. ఆ తరువాత ప్రపంచ బ్యాంకు ఆధ్వర్యంలోని సంస్థలో రూ.కోటి వార్షిక వేతనంతో ఉద్యోగం చేసిన హరిచందన.. ఆ ఉద్యోగాన్ని వదిలేసి స్వదేశానికి వచ్చారు. మొదట సివిల్స్ రాసినప్పుడు ఐఆర్‌ఎస్ సాధించిన ఆమె 2009లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. శిక్షణ పూర్తయ్యాక 2010లో విశాఖపట్నం అసిస్టెంట్ కలెక్టర్‌గా విధుల్లో చేరారు. ఆ తరువాత విజయవాడ సబ్ కలెక్టర్‌గా, హైదరాబాద్‌లో జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌గా, ఆయుష్ డైరెక్టర్‌గా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు.

దేశవ్యాప్తంగా పేరుప్రతిష్టలు

జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌గా ఉన్నప్పుడు ఆమె తడి, పొడి చెత్తను వేరు చేయడం, ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్, చెత్త నుంచి ప్లాస్టిక్‌ను వేరుచేయడం, వ్యర్థాలను ఎరువుగా మార్చడం, పంచతంత్ర పార్కుల అభివృద్ధి వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. దేశంలోనే మొదటిసారిగా హైదరాబాద్‌లో వెదురుతో సమావేశ మందిరాన్ని నిర్మించారు. గచ్చిబౌలిలో ప్రత్యేకమైన డాగ్ పార్కును ఏర్పాటు చేశారు. జీరో వేస్ట్ కార్యాలయం, షీ టాయిలెట్స్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చారు. ఆమె భర్త ఐఆర్‌ఎస్ అధికారి కాగా.. వీరికి ఒక కూతురు ఉంది.

పెట్రోల్ బంక్‌లు ఖాళీ..



ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మె చేస్తున్నారని తెలియడంతో మంగళవారం పెద్ద ఎత్తున వాహనదారులు పెట్రోల్ బంక్‌ల వద్దకు చేరి పెట్రోల్, డీజిల్ పోయించుకున్నారు. దీంతో రాత్రి వరకు బంక్‌లన్నీ ఖాళీ అయ్యాయి. కొందరు బుధవారం బంక్‌ల వద్దకు వెళ్లేసరికి నోస్టాక్ బోర్డు కనిపించడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. – భువనగిరిటౌన్

వైన్ షాపులో దొంగతనం

- రూ.4,21,000 నగదు, మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లిన దుండగులు


దొంగతనం జరిగిన వైన్ షాపు పరిసరాలను పరిశీలిస్తున్న క్లూస్ టీం

రాజాపేట: గుర్తుతెలియని వ్యక్తులు వైన్ షాపులో చొరబడి నగదు, మద్యం ఎత్తుకెళ్లారు. ఈ ఘటన రాజాపేట మండలంలోని పొట్టిమర్రి గ్రామ పరిధిలో జరిగింది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొట్టిమర్రి గ్రామ పరిధిలో మాధవరెడ్డి అనే వ్యక్తి అరుణాచల వైన్ షాపును నిర్వహిస్తున్నాడు. కాగా మంగళవారం రాత్రి 10 గంటలకు రోజుమాదిరిగానే వైన్ షాపునకు తాళాలు వేసి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం అటుగా వెళ్తున్న గ్రామస్తులు వైన్ షాపులో దొంగలు పడినట్లు గుర్తించి మాధవరెడ్డికి సమాచారం ఇచ్చారు. వెంటనే షాపు వద్దకు చేరుకున్న మాధవరెడ్డి చోరీ జరిగిన విషయాన్ని పోలీసులకు తెలియజేశాడు. దీంతో ఏసీపీ శివరాంరెడ్డి, సీఐ సురేందర్ రెడ్డి, ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి క్లూస్ టీంను రప్పించి పరిసరాలను పరిశీలించారు. రూ.4,21,000 నగదుతో పాటు సుమారు 10 మద్యం బాటిళ్లు చోరీకి గురైనట్లు వైన్ షాపు నిర్వాహకుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

ఇష్టారీతిన చెరువు మట్టి తవ్వకం

- గుంతలుగా మారుతున్న చెరువు
- చేపల పెంపకానికి ఇబ్బంది అవుతుందని మత్స్య సొసైటీ సభ్యుల ఆవేదన


ట్రాక్టర్లలో చెరువులోని మట్టిని తరలిస్తున్న రైతులు

పాలకవీడు: మండలంలోని జాన్‌పహాడ్‌లో గల చెరువులో నీరు ఇంకిపోవడంతో స్థానిక రైతులు చెరువులోని సారవంతమైన మట్టిని పంట పొలాలకు తోలుకుంటున్నారు. మట్టిని తవ్వే జేసీబీ యంత్రాల నిర్వాహకులు ట్రాక్టర్ ట్రిప్పుకు రైతుల వద్ద నుంచి కిరాయి తీసుకుంటూ ఎక్కువ సంఖ్యలో ట్రిప్పులు పడాలనే దురాలోచనతో ఒకేచోట గుంతలు పెడుతూ మట్టిని తవ్వుతున్నారని. చెరువులో జేసీబీతో ఇష్టారీతిన లోతుగా గుంతలు తవ్వి తరలిస్తున్నారని, దీంతో భవిష్యత్‌లో చేపలు పెంచాలన్నా, వాటిని పట్టాలన్నా ఇబ్బందులు ఎదురవుతాయని మత్స్య సొసైటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని వారు గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన రెవెన్యూ అధికారులకు తెలిపారని అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని అంటున్నారు. మట్టి తవ్వకాలపై కొందరు నీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం అందించగా సిబ్బంది అక్కడికి చేరుకుని తవ్వకాలను నిలిపివేసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనిపై నీటిపారుదల శాఖ డివిజనల్ ఏఈ సతీష్‌ను వివరణ కోరగా చెరువు మట్టి ఇష్టారీతిన తవ్వుతున్నారనే సమాచారం అందిందని, సిబ్బందిని పంపి తవ్వకాలను నిలిపివేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా తవ్వితే రైతులైనా సరే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని, అనుమతులు తీసుకొని తాము సూచించిన పద్ధతిలో మాత్రమే తవ్వకాలు జరపాలన్నారు.

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి వృద్ధుడు మృతి

- ప్రైవేట్ క్లినిక్ ఎదుట బంధువుల ఆందోళన


వెంకటయ్య మృతదేహం


ప్రైవేట్ క్లినిక్ ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు

నకిరేకల్: అనారోగ్యంతో ఆర్‌ఎంపీ వైద్యుడి వద్ద చికిత్స చేయించుకున్న వ్యక్తి మృతిచెందాడు. అయితే ఆర్‌ఎంపీ వైద్యుడు చేసిన వైద్యం వికటించే సదరు వ్యక్తి చనిపోయాడని అతడి బంధువుల ప్రైవేట్ క్లినిక్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ ఘటన బుధవారం సాయంత్రం నకిరేకల్ పట్టణంలో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్‌లోని 18వ వార్డు ముత్యాలమ్మ గుడి సమీపంలో నివాసముంటున్న బొంత వెంకటయ్య(60)కు భార్య, కుమారుడు ఉన్నారు. వెంకటయ్య కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం వెంకటయ్యకు జ్వరం రావడంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ క్లినిక్‌లో చికిత్స కోసం వెళ్లాడు. ఆ క్లినిక్‌లో పనిచేసే ఆర్‌ఎంపీ వైద్యుడు వెంకటయ్యకు ఇంజెక్షన్, మాత్రలు ఇచ్చి పంపాడు. అయితే చికిత్స చేసిన ఆర్‌ఎంపీ వైద్యుడే సాయంత్రం వెంకటయ్య ఇంటికి వెళ్లి తాను ఇచ్చిన మాత్రలను తిరిగి తెచ్చాడు. బుధవారం వెంకటయ్య తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఆర్‌ఎంపీ వైద్యుడు చేసిన వైద్యం వికటించే వెంకటయ్య మృతిచెందాడని ఆగ్రహించిన అతడి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని సదరు ప్రైవేట్ క్లినిక్ ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న నకిరేకల్ ఎస్‌ఐలు సుధీర్‌కుమార్, గోపికృష్ణ అక్కడకు చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి, మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ గదిలో భద్రపరిచారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నామని ఇంకా ఫిర్యాదు మాకు అందలేదని ఎస్‌ఐలు తెలిపారు

'ఐఎస్‌ఐ'పై విద్యార్థులకు అవగాహన అవసరం

- బీఐఎస్ రాష్ట్ర డైరెక్టర్ కేవీ రావు


విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కేవీ రావు

భువనగిరి రూరల్ : ఐఎస్‌ఐ మార్కుపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని బీఐఎస్ రాష్ట్ర డైరెక్టర్ కేవీ రావు సూచించారు. భువనగిరి మండలంలోని మండలం అనంతారంలోని బీసీ గురుకుల స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బీఐఎస్) ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ఐఎస్‌ఐ మార్క్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ రాకేష్ తన్నీరు, స్టాండర్డ్ ప్రమోషన్ ఆఫీసర్ అభిసాయితో కలిసి కేవీఆర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వస్తువుల నాణ్యత ప్రామాణికతను తనిఖీ చేయడానికి ఐఎస్‌ఐ మార్కు దోహదపడుతుందన్నారు. బంగారం యొక్క స్వచ్ఛతకు హాల్ మార్క్, వ్యవసాయ వస్తువుల నాణ్యతకు అగ్రిమార్కు, ఎలక్ట్రానిక్ వస్తువుల నాణ్యతను ఎస్ మార్కు ద్వారా తెలుసుకోవచ్చన్నారు. మార్కెట్‌లో ఐఎస్‌ఐ మార్కు లేని వస్తువులు కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు స్టాండర్డ్ రైటింగ్, పోస్టర్‌మేకింగ్‌లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అసభ్య మెసేజ్‌లు పంపిన టీచర్

- దేహశుద్ధి చేసిన విద్యార్థిని కుటుంబ సభ్యులు
- ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు


నిందితుడు సంజయ్

భువనగిరి క్రైం: పదో తరగతి విద్యార్థినికి ఉపాధ్యాయుడు అసభ్య మెసేజ్‌లు పంపి వేధించాడు. విషయం తెలుసుకున్న విద్యార్థిని కుటుంబ సభ్యులు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. ఈ ఘటన బుధవారం భువనగిరి పట్టణంలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు, విద్యార్థిని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో నివసించే బెల్లి సంజయ్ పట్టణంలో పలు పాఠశాలల్లో పీరియడ్ వారీగా సైన్స్ సబ్జెక్ట్ బోధిస్తుంటాడు. కొందరు విద్యార్థులు సబ్జెక్ట్‌లో తమ అనుమానాల నివృత్తి కోసం పలుమార్లు సంజయ్‌ను సెల్‌ఫోన్‌లో సంప్రదించేవారు. ఇదే అదనుగా భావించిన సంజయ్ ఓ విద్యార్థిని సెల్ ఫోన్‌కు అసభ్య మెసేజ్‌లు పంపడం ప్రారంభించాడు. సోషల్ మీడియా యాప్ అయిన ఇన్‌స్టాగామ్‌లోనూ ఆ విద్యార్థినికి ఫొటోలు పంపేవాడు. తన ఫొటోలకు రిప్లై ఇవ్వాలని.. లేదంటే ఫెయిల్ చేస్తానని బెదించేవాడు. దీంతో ఆ విద్యార్థిని ఆందోళనకు గురవుతుండగా కుటుంబ సభ్యులు గుర్తించి ఏం జరిగిందని ఆరా తీయడంతో సంజయ్ బాగోతం బయటపడింది. దీంతో విద్యార్థిని కుటుంబ సభ్యులు ఇదే విషయమై బుధవారం పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడు సంజయ్‌ని నిలదీయగా.. నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. దీంతో ఆగ్రహానికి గురైన విద్యార్థిని కుటుంబ సభ్యులు సంజయ్‌కి దేహశుద్ధి చేశారు. స్కూల్ యాజమాన్యంపై విద్యార్థిని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ సంజయ్ కృ, ఎస్‌ఐ నాగరాజు పాఠశాలకు వచ్చి టీచర్ సంజయ్‌ని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టుకు సరెండర్ చేశారు. కాగా సంజయ్‌పై గతంలోనూ ఇదేవిధంగా పలువురిని ఇబ్బందులు పెట్టినట్లు తెలుస్తోంది. నిందుతుడిని కఠినంగా శిక్షించాలని ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, ఆలిండియా పేరెంట్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు కలెక్టర్, డీఈఓ, పోలీసులకు ఫిర్యాదులు, వినతి పత్రాలు సమర్పించారు.